క్లుప్తంగా

గోదావరి గట్టు రెయిలింగ్ ధ్వంసం



గోదావరి గట్టు వెంబడి ధ్వంసమైన రెయిలింగ్

నరసాపురం: పట్టణంలో గోదావరి గట్టు వెంబడి పాలరాయితో నిర్మించిన రెయిలింగ్ ధ్వంసమైంది. దీనిని 2015 గోదావరి పుష్కరాల సమయంలో గట్టు వెంబడి నిర్మించారు. అయితే పర్యవేక్షణ లేకపోవడంతో రెయిలింగ్ ధ్వంసమైంది. గట్టు వెంబడి నిర్మించిన ఫుట్‌పాత్ కూడా ధ్వంసమైంది. వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

స్కూల్ గేమ్స్ ప్రారంభం



మార్టేరులో గ్రిల్ స్పోర్ట్స్ ప్రారంభిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: ఆచంట నియోజకవర్గం పరిధిలో గ్రిల్ స్పోర్ట్స్, గేమ్స్ సోమవారం మార్టేరులోని వేణుగోపాల ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభించారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివే విద్యార్థులకు వాలీబాల్ కబడ్డీ, ఖోఖో, త్రోబాల్ క్రీడల్లో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందాలతో పాటు డిస్కస్‌త్రో, షార్ట్‌పుట్, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించామని స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పడాల శ్రీనివాసరెడ్డి తెలిపారు.

స్నానాలకు వీలుగా కేదారీ ఘాట్



రేవును శుభ్రం చేస్తున్న సిబ్బంది

పెనుగొండ : మహాశివరాత్రి పుణ్యస్నానాలకు ఇబ్బందులు లేకుండా వశిష్ఠా గోదావరి సిద్ధాంతం కేదారీఘాట్‌లను పంచాయతీ ఆధ్వర్యంలో శుభ్ర పరిచారు. సోమవారం సర్పంచ్ చింతపల్లి గనిరాజు (చంటి) పర్యవేక్షణలో పంచాయితీ సిబ్బంది శుభ్రం చేశారు. భక్తులు స్నానాల చేయటానికి వీలుగా రేవుల్లో ఉన్న సీసా పెంకులు, చిరిగిపోయిన దుస్తులను తొలగించారు. సర్పంచ్ చంటి మాట్లాడుతూ స్నానాలు చేయడానికి వచ్చే భక్తులు రేవుల్లో శుభ్రత పాటించి అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి కిషోర్ బాబు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రణాళికతోనే వృద్ధి సాధ్యం

ఆకివీడు: ఆర్థిక ప్రణాళికతోనే కుటుంబాలు ప్రగతి సాధిస్తాయని యూనియన్ బ్యాంక్ మేనేజర్ వి.విక్టర్ బాబు చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలో ఎస్ఎస్ఐ సంస్థ ఆధ్వర్యంలో ఆర్‌బీఐ ఆదేశాల మేరకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక ప్రగతిపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. అనంతరం స్త్రీల శ్రేయస్సు అంశంపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీ అనిల్, ఎరిచర్ల గ్లాడ్‌సన్, బెల్‌షాజర్, వీడీఏ మల్లేశ్వరి, మహిళలు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సత్యదేవుని వత్రాలు



స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అత్తిలి: మాఘమాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లాలో బుల్లి తిరుపతిగా పేరుగాంచిన అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం సామూహిక సత్యనారాయణ వత్రాలు, శ్రీనివాస కల్యాణ మహోత్సవాలు కనులపండువగా జరిగాయి. ఉదయం స్వామి వారిని పుష్పాలతో అలంకరించిన వాహనంపై ఉంచి మేళతాళాల నడుమ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ వత్ర పూజలు జరిగాయి. గ్రామానికి చెందిన మాజీ చైర్మన్ ప్రభాకర కోటిరామలింగరాజు దంపతులతో పాటు 130 మంది దంపతులు సత్యదేవుని వ్రతాలను ఆచరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు, వాడపల్లి విఖన్‌బాబు ఆధ్వర్యంలో చానమిల్లి గ్రామానికి చెందిన నరశింహాచార్యులు పలువురు వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ సత్యదేవుని వత్రాలు, శ్రీనివాస కల్యాణ తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. భీమవరానికి చెందిన వారణాసి లక్ష్మీ నరశింహశాస్త్రి కల్యాణోత్సవ, సత్యదేవుని వత్రాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సత్యనారాయణస్వామి వత్రాలు, శ్రీనివాస కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల భక్తులు హాజరైయ్యారు. వీరికి అన్నవరం సత్యనారాయణస్వామి ప్రసాదం అందజేసి, అన్న ప్రసాద వితరణ చేశారు.

డ్రెయినేజీ పూడ్చేశారు!

- పాలకొల్లులో రోడ్డుపైనే మురుగునీరు తిష్ట
- స్థానికులకు వ్యాధుల భయం
- దిగమర్రు చానల్ మరమ్మతులతో ఇబ్బందులు



డ్రెయినేజీని పూడ్చేయడంతో రోడ్డుపైకి వస్తున్న మురుగునీరు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక 20వ వార్డు వెలమగూడెం ప్రాంతంలో డ్రెయినేజీని మట్టితో దిగమర్రు చానల్‌లో తవ్విన మట్టితో పూడ్చేయడంతో మురుగునీరు రోడ్లపైకి చేరింది. దీంతో సుమారు 250 నుంచి 300 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మరో రెండు రోజుల్లో సమస్య పరిష్కారం కాకుంటే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో నిధులు మంజూరు

పాలకొల్లు పట్టణంలో చిన్నకార్ల స్టాండ్ నుంచి దిగమర్రు చానల్ ప్రారంభమవుతుంది. ఈ చానల్ ద్వారా దిగమర్రు, వరిదనం, పెదమామిడిపల్లి, కొత్తపేట, కాజ, పెదగరువు, కొంతేరు, చిట్టవరం గ్రామాల్లో ఉన్న 5,050 ఎకరాలకు సాగునీరు, అలాగే ప్రజలకు తాగునీరుగా అందుతుంది. ఈ కాలువ పూడుకుపోవడంతో వైఎస్సార్‌సీపీ హయాంలో తవ్వకం పనులకు నిధులు మంజూరు చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో టెండర్లు రద్దు చేశారు. ఇటీవల మూడు నెలలు క్రితం టెండర్ పిలవగా రూ.7.30 లక్షలకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ చానల్ తవ్వకం పనులు ప్రారంభించారు. నాలుగు రోజుల క్రితం పనులు పూర్తి చేయించారు.

ప్రబల నున్న వ్యాధులు

దిగమర్రు కాలువ పరిధిలో పాలకొల్లు పట్టణంలో 20, 21 వార్డులు ఉన్నాయి. కాలువ తవ్వగా వచ్చిన మట్టిని ఇళ్ల ముందు వేశారు. ఈ మట్టిని కొంతవరకు తొలగించినా వెలమగూడెం ప్రాంతంలో చిన్న కార్ల స్టాండ్ వెనుక ఉన్న మునిసిపల్ డ్రెయినేజీని పూడ్చివేశారు. ఇది 20వ వార్డు ప్రజలకు సమస్యగా మారింది. ఈ ప్రాంతంలో ఉన్న చిన్న వంతెన రెయిలింగ్ పగిలిపోయింది. ఈ వంతెన నుంచి హారిక చికెన్ సెంటర్ వద్ద ఉన్న డ్రెయినేజీ నుంచి రోడ్డు అవతల వెలమగూడెం పెద్ద వంతెన వరకు మురుగు నీరు వెళుతుంది. డ్రెయినేజీ నీరు కాలువల్లోకి వదిలేస్తుండడంతో వాటిని ఇరిగేషన్ అధికారులు మట్టితో మూసివేశారు. చికెన్ సెంటర్ వెనుక, వెలమగూడెం పెద్ద వంతెన వద్ద ఉన్న డ్రెయినేజీలను మట్టితో పూడ్చేయడంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతుంది. మరో రెండు రోజుల్లో సమస్య పరిష్కారం కాకుంటే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి పూడ్చిన డ్రెయినేజీలో మట్టిని తాత్కాలికంగా తొలగించడమో లేదా డ్రెయినేజీ నిర్మించడమో చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చిన్న వంతెన వద్ద డ్రెయినేజీలో వేసిన మట్టి



వెలమగూడెం పెద్ద వంతెన వద్ద పూడ్చిన డ్రెయినేజీ

> **ప్రత్యామ్నాయ మార్గం చూపుతాం**
>
> కాల్వ తవ్వకం పనుల్లో మిషన్ వెళ్లడానికి మార్గం వేసుకున్నట్లు తెలిసింది. రెండు రోజుల్లో ఆ మట్టిని తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. మురుగునీరు వెళ్లేలా ప్రత్యామ్నాయ మార్గం చూసి సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించడం జరుగుతుంది.
>
> – బి.విజయసారథి, మునిసిపల్ కమిషనర్, పాలకొల్లు

అధ్వానంగా ఏటిగట్టు లైటింగ్

నరసాపురం : నరసాపురం గోదావరి ఏటిగట్టు పొడవునా వీధిలైట్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. లైట్లు సవ్యంగా వెలగడం లేదు. పోయిన లైట్లు మునిసిపల్ అధికారులు పునరుద్ధరించడంలేదు. వలందరరేవు, లలితాంబ ఘాట్ వద్ద, పడవల రేవు తప్పిస్తే ఏటిగట్టు పొడవునా వీధి లైట్లు వెలగడం లేదు. నిత్యం ఏటిగట్టు ప్రాంతానికి సాయంత్రం వేళల్లో పట్టణ వాసులు పెద్ద సంఖ్యలో షికారుకు వస్తారు. లైట్లు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదకరంగా వంతెన మార్గం



వంతెన మార్గంలో పైకి లేచిన రాళ్లు

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాదలో మంగళగుంటపాలెంకు వెళ్లే వంతెన మార్గం ప్రమాదకరంగా మారింది. వంతెన ఎక్కే మార్గంలో అటూ ఇటూ కూడా రాళ్లు పైకిలేచి పోయాయి. రోడ్డు శిథిలమైంది. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురువుతున్నారు. సైకిళ్లపై వెళ్లే స్కూల్ విద్యార్థులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెనుగొండ: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.ఎస్తేర్ క్వీనీ సోమవారం తెలిపారు. మార్చి 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 6న ప్రవేశ పరీక్ష ఉంటుందని, పూర్తి వివరాలకు విద్యార్థి స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో గురుకుల పాఠశాలలో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

వ్యక్తికి రూ.10 వేలు జరిమానా

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో పట్టణానికి చెందిన పెచ్చేటి సింహాద్రి అప్పారావుకు రూ. 10 వేలు జరిమానా విధించినట్లు వన్‌టౌన్ సీఐ ఎం నాగరాజు సోమవారం చెప్పారు. నిందితుడు అప్పారావును భీమవరం స్పెషల్ జ్యుడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చగా స్పెషల్ జ్యుడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎంవీఎస్ రాజారావు పై మొత్తాన్ని జరిమానా విధించారన్నారని నాగరాజు తెలిపారు.

రామ్మూర్తికి సత్కారం

కాళ్ల: సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ – జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (జెడ్ఆర్‌యూసీసీ) సభ్యుడిగా ఎంపికైన కోరా రామ్మూర్తిని కూటమి శ్రేణులు సత్కరించారు. కాళ్ల మండలం పెదఅమీరం పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. తమ గ్రామానికి చెందిన రామ్మూర్తి ప్రతిష్టాత్మక జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడిగా ఎంపికవ్వడం శుభపరిణామమన్నారు. అనంతరం రామ్మూర్తిని పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బూరాడ వెంకటకృష్ణ, డొక్కు యాగవేంద్రరావు, నడింపల్లి సుబ్బరాజు, జాషువా, ప్రసాద్, కిషోర్, పలువురు వార్డు మెంబర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆచంటేశ్వరునికి పట్టువస్త్రాల సమర్పణ

పెనుగొండ: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆచంటలోని ఆచంటేశ్వరునికి దేవాదాయ శాఖాధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. సోమవారం ఉదయం ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్షబిల్వార్చన, లక్షకుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ స్వామివారికి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యుడు నెక్కంటి గణేశ్వరరావు, ఆలయ అర్చకుడు శంకర మంచి ఉమామహేశ్వరరావు, సన్నిధి రాజు కొండయ్యలు పాల్గొన్నారు.

నందివాహనంపై గ్రామోత్సవం

శ్రీనగరేశ్వర మహిత‌షాసురమర్ధనీ వాసవీకన్యకపరమేశ్వరి ఆలయంలో మహాశివరాతిర ఉత్సవాల్లో భాగంగా నగరేశ్వరుని, మహిషాసరమర్ధనీ అమ్మవార్లను నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి నగరేశ్వరునికి ఏకాదశ రుద్రాభిషేకంలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుబ్బల రామపెద్దింట్లు రావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఆచంటేశ్వరునికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న అధికారులు



నంది వాహనంపై ఊరేగుతున్న నందీశ్వరుడు

'సూర్యఘర్ యోజన'ను సద్వినియోగం చేసుకోవాలి

పోడూరు: 'సూర్యఘర్ యోజన' పథకాన్ని అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిన్నూరు గ్రామసర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి అన్నారు. జిన్నూరు సచివాలయంలో పీఎం సూర్యఘర్ యోజన పథకంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో సర్పంచ్ మాట్లాడుతూ సూర్యఘర్ యోజన ద్వారా గృహావసర విద్యుత్ వినియోగం కోసం సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఎలక్ట్రికల్ ఏడీ సీహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు ద్వారా వినియోగదారులు తమ విద్యుత్ బిల్లు ఖర్చులను 70 శాతం వరకు తగ్గించుకోవచ్చని చెప్పారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునే వినియోగదారులు తమ గ్రామంలోని ఎలక్ట్రికల్ లైన్‌మెన్‌ను లేదా పోడూరు సబ్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ సత్యనారాయణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాద్, మాజీ ఎంపీటీసీ పాలవలస తులసీరావు, మట్టపర్రు నీటిసంఘం అధ్యక్షుడు దేవళ్ల శ్రీరామకోటి మోహన్, ఎలక్ట్రికల్ లైన్‌మెన్‌లు మొబిన్, మోహన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, రామకృష్ణలు పాల్గొన్నారు.



జిన్నూరులో పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఘనంగా వీరన్నబాబు సంబరం



వీరన్నబాబు గద్దె వద్ద భక్తుల కోలాహలం



మేడపాడులో వీరన్నబాబు ఊరేగింపు

యలమంచిలి: మేడపాడులో వీరన్నబాబు గద్దె వద్ద సోమవారం మేడిచర్ల వంశస్తుల ఆధ్వర్యంలో సంబరం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా మహా శివరాత్రికి ముందు వచ్చే సోమవారం వీరన్నబాబు గద్దె వద్ద సంబరం చేస్తారు. ఈ క్రమంలో ముందుగా గద్దె వద్ద పూజలు, జాతర నిర్వహించి తరువాత మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామ దేవతలు వెంకమ్మ, కనకదుర్గమ్మ, జువ్వాలమ్మ అమ్మవార్ల ఆలయాలకు వెళ్లారు. అక్కడ అమ్మవార్లను దర్శించుకున్న తరువాత స్థానిక మంచినీటి చెరువు తూర్పు గట్టున ఉన్న శమీ వృక్షం వద్ద పూజలు చేసి, వృక్షం మొదటిలో కుంభం పోశారు. సంతానం లేని మహిళలు ఉంటే ఈ కుంభంలో నుంచి ముద్దలు తీసుకుని సేవిస్తే తరువాత ఏడాది పిల్లలు పుడతారని నమ్మకం. దీంతో మహిళలు అధిక సంఖ్యలో ఇక్కడకు వచ్చి కుంభంలోని ముద్దలు స్వీకరించారు. ఈ క్రతువు పూర్తయిన అనంతరం మళ్లీ గద్దె వద్దకు చేరుకుని వీరన్నబాబుని దర్శించుకున్నారు. గద్దె భక్తులు వీరన్నబాబు చేత విబూది బొట్టు పెట్టించుకుని, తాళ్లు కట్టించుకున్నారు. ఈ సందర్భంగా గద్దె నిర్వాహకులు గ్రామస్తుల సహకారంతో భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

రేపటి నుంచి వీరభద్రస్వామి ఉత్సవాలు



కరపత్రం విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక లాకు సెంటర్ కొత్తపేట ప్రాంతంలో కొలువైన భద్రకాళీ వీరభద్రస్వామి మహోత్సవాలు బుధవారం నుంచి 12 రోజులు పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వట్టం గణేశ్వరరావు తెలిపారు. ఉదయం 9 గంటలకు స్వామివారి ఆనసంబరం, మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పంజాబ్, కేరళ వాయిద్యాలు, శక్తి వేషాలు, గరగల నృత్యాలు, సన్నాయి వాయిద్యాలతో స్వామివారి ఊరేగింపు ఉంటుందని చెప్పారు. ఊరేగింపు అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద నిప్పుల గుండం ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బాసిన గున్నేశ్వరరావు, బాసిన సత్యనారాయణ, మానెం బసవరాజు, వట్టం భాస్కరరావు, శీరం ఆనందకృష్ణ, యర్రా శివాజీ, బి రాజు, మోహన్, చంద్రశేఖర్, ఎం వాసు, రాము, బాబి తదితరులు పాల్గొన్నారు.

ఆటలతో మానసిక ఒత్తిడి దూరం

ఆకివీడు: అనారోగ్యాన్ని, ఒత్తిళ్లను క్రీడలు దూరం చేస్తాయని ఉప విద్యాశాఖాధికారి ఎస్.రమేష్ చెప్పారు. మండలంలోని సిద్దాపురంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జోనల్ క్రీడల్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యం సాధించాలని పిలుపునిచ్చారు. శరీరక దారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయన్నారు. మానసికోల్లాసానికి క్రీడలు తోడ్పడతాయన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు, తదనంతరం సమాజానికి ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ ఏ.రవీంద్ర చెప్పారు. క్రీడాకారులకు ఆయా విభాగాల్లో పోటీలను జోనల్ క్రీడా పోటీల నిర్వహకులు, పీఈటీ జీ.మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.గేమ్స్, అథ్లెటిక్స్ పోటీల జాబితాను ప్రకటించారు. రెండు రోజుల పాటు పోటీలు కొనసాగుతాయని చెప్పారు. సమావేశంలో ఉపాధ్యాయులు, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

ఉద్యోగుల తొలగింపు నిర్ణయం సరికాదు

పెనుగొండ: రాష్ట్రంలో రెవెన్యూ ఉద్యోగులను తొలగించాలని నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఏపీ ఎన్జీవో రాష్ట్ర నాయకులు ఎల్‌వీ సాగర్ హెచ్చరించారు. సోమవారం ఆచంట తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ముందు ఉద్యోగులకు డీఏ పెండింగ్‌లో ఉండవని చంద్రబాబు హామీ ఇచ్చారని, 2018 నుంచి డీఏలు బకాయిలు ఉన్నాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు ఇంతవరకు నెరవేర్చకపోవడం మోసపూరితమేనని ధ్వజమెత్తారు. రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేస్తున్న కంప్యూటర్ డేటా ఆపరేటర్లు ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం తొలగించనున్నారని, ప్రభుత్వ చర్యలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. రెవెన్యూ ఉద్యోగుల భద్రత కోసం ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై రాము, జిల్లా అధ్యక్షులు ఎస్‌వీఎన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయంలో మాట్లాడుతున్న ఎన్జీవో సంఘం నాయకుడు సాగర్

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ఆకివీడు: నగర పంచాయతీ హోదా వచ్చినప్పటికీ ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తొలగిపోలేదని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశ హాలులో నగర పంచాయతీ చైర్ పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో కౌన్సిలర్ నిమ్మల నాగేశ్వరరావు (నాగు) మాట్లాడుతూ పట్టణ హోదా వచ్చినప్పటికీ ప్రజలకు పంచాయతీ సేవలు కూడా అందడంలేదని వాపోయారు. పట్టణంలో మంచినీటి సమస్య కొన్నేళ్లుగా ఉందని, వాటిని పరిష్కరించాలని ప్రతి సమావేశంలో మొరపెట్టుకున్నా కమిషనర్ పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నాచుతో నీచు కంపు కొడుతున్న నీటిని ప్రజలు తాగాల్సి వస్తోందని బాటిల్‌తో పట్టి తెచ్చిన కలుషితమైన నీటిని కమిషనర్‌కు చూపించారు. దీనివల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిల్టర్ బెడ్లలో ఇసుక మార్చడంలేదని, బ్లీచింగ్, క్లోరినేషన్ చేయడంలేదని వాపోయారు. స్థానికంగా కమిషనర్ నివసించడం లేదని, ఈ నీటిని తాగితే తెలుస్తుందని నాగు ఆరోపించడంతో వెంటనే బాటిల్‌లోని నీటిని కమిషనర్ తాగి చూపించారు. రోజూ ఈ నీటిని తాగడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని నాగు అన్నారు. పట్టణంలోని మాదివాడ ప్రధాన రోడ్డు పేరును మార్చారని, మోటుపల్లి వారి వీధిగా పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి ఉందని, మార్చిన పేరు స్థానంలో మోటుపల్లి వారి వీధి పేరు ఎందుకు తీసుకురావడంలేదని ధ్వజమెత్తారు. వైస్ చైర్మన్ పుప్పాల పండు మాట్లాడుతూ మంచినీటి సమస్యపై అన్ని సమావేశాల్లో మొత్తుకుంటున్నారన్నారు. నాన్‌లే అవుట్ భూములు, ఖాళీ ప్రదేశాలకు పన్ను విధించడం ద్వారా ఆదాయం పెరుగుతుందన్నారు. కౌన్సిలర్ జిల్లా పెద్దిరాజు మాట్లాడుతూ తన వార్డులో పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోఆప్షన్ సభ్యులు మన్నే లలితాదేవి మాట్లాడుతూ అమృత పథకంలో పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వీటిపై కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వల్ల టెండర్ల ఖరారు కాలేదన్నారు. అమృత స్కీమ్‌లో పైప్‌లైన్ల విస్తరణ, ట్యాంకుల నిర్మాణ పనులు త్వరలోనే చేపడతామన్నారు. మంచినీటి సమస్య పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. తొలుత అజెండాకు తీసుకువచ్చిన 2024–2025 ఆదాయ, వ్యయ పట్టికను సమావేశం ఆమోదించింది. సమావేశంలో వైస్‌చైర్మన్ వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.